సాక్షి శ్రీకాకుళం

శనివారం । 24 । జూన్ । 2023



ఉత్సాహంగా ఒలింపిక్ డే రన్

ఒలింపిక్ డే రన్ ఉత్సాహంగా జరిగింది. ఆరోగ్యవంతమైన సమాజం కోసం పిలుపునిచ్చారు. -10లో



పారదర్శకతే లక్ష్యంగా..

ఈ-స్టాంపింగ్ వైపు జనం మొగ్గు చూపుతున్నారు. ఇది పారదర్శకతను మరింత పెంచుతుంది. -10లో

శ్రీకాకుళం జిల్లా ఉష్ణోగ్రతలు

మండలం	గరిష్ఠం	కనిష్ఠం
ఆమదాలవలస	30°	26°
ఇచ్ఛాపురం	30°	26°
పాతపట్నం	29°	26°
శ్రీకాకుళం	30°	25°

న్యూస్‌రీల్

గురుకులాల్లో మిగులు సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం పాతబస్టాండ్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ జిల్లా కో ఆర్డినేటర్ గ్రేస్ తెలిపారు. జిల్లాలో 8 గురుకుల పాఠశాలల్లో ఆరో తరగతి నుంచి 9వ తరగతి వరకు వివిధ కేటగిరీల్లో సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఈ నెల 28వ తేదీ లోగా ఆయా పాఠశాలల్లో విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని, వారికి ఈ నెల 30వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. వివరాలకు పాఠశాలల పని వేళల్లో ఆయా పాఠశాలలను సంప్రదించాలని సూచించారు.

బీచ్‌ల అభివృద్ధిపై ప్రత్యేక ప్రణాళిక



జీరుపాలెంలో గ్రామంలో బీచ్ సందర్శిస్తున్న పర్యాటక, మత్స్యశాఖ అధికారులు

రణస్థలం: సముద్ర తీర ప్రాంతాల్లో బీచ్‌లకు అనువైన ప్రాంతాలను గుర్తించి అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని ఆంధ్రా విశ్వ విద్యాలయం మత్స్య ప్రొఫెసర్ ఆనంద ప్రసాద్, జిల్లా పర్యాటక శాఖ అధికారి ఎన్.నారాయణరావులు తెలిపారు. మండలంలోని జీరుపాలెం, పోతయ్యపేట, అల్లివలస బీచ్‌లను పర్యాటక, మత్స్యశాఖ అధికారులు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యాటకానికి అనుగుణంగా ఉండే బీచ్‌లను గుర్తించి అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక రూపొందించాలని ఉన్నతాధికారులు ఆదేశించారని తెలిపారు. కార్యక్రమంలో మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ టి.సంతోష్‌కుమార్, మత్స్య విశ్వవిద్యాలయ విద్యార్థి శాంతన్న, మండల మత్స్యశాఖ అధికారులు కె.నాగరాజు, శంకర్, రవికుమార్, సుప్రియ, రమ్య, వైఎస్సార్ సీపీ నాయకులు మైలపల్లి కామరాజు తదితరులు ఉన్నారు.

స్పోర్ట్స్ స్కూల్‌కు ముగిసిన ఎంపిక పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: డాక్టర్ వైఎస్సార్ కడప జిల్లాలోని డాక్టర్ వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్‌లో 4, 5వ తరగతుల్లో ప్రవేశాలకు కోసం జిల్లాలో నిర్వహించిన ఎంపిక పోటీల ప్రక్రియ ముగిసింది. ఇటీవలి మండలస్థాయిలో ఎంపిక చేసిన క్రీడాకారులకు శుక్రవారం స్థానిక కోడిరామ్మూర్తి స్టేడియం ప్రాంగణంలో ఎంపికలను నిర్వహించారు. ఎంపికలకు హాజరైన విద్యార్థులకు వ్యక్తిగత వివరాలు, శారీరక కొలతలతోపాటు వివిధ సామర్థ్య పరీక్షలను నిర్వహించారు. రాణించిన క్రీడాకారులను త్వరలో జరిగే రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలకు పంపిస్తామన్నారు. ఎంపికైన క్రీడాకారుల జాబితా త్వరలో వెల్లడిస్తామని డీఎస్ఏ చీఫ్ కోచ్ డాక్టర్ కె.శ్రీధర్‌రావు తెలిపారు. ఈ ఎంపికలను సీఈఓ బీవీ ప్రసాదరావు పర్యవేక్షించారు. శాప్/డీఎస్ఏ కోచ్‌లు ఈ ఎంపిక పోటీలను నిర్వహించారు.

బొడ్డేపల్లి శతజయంతి ముగింపు ఉత్సవం రేపు

శ్రీకాకుళం పాతబస్టాండ్: మాజీ పార్లమెంటు సభ్యులు స్వర్గీయ బొడ్డేపల్లి రాజగోపాలరావు శతజయంతి ఉత్సవాల్లో ముగింపు కార్యక్రమం ఆదివారం జరగనుందని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం పది గంటలకు నగరంలోని ఎన్టీఆర్ మున్సిపల్ ఉన్నత పాఠశాల మైదానంలో కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఏడు రోడ్ల జంక్షన్‌లో బీఆర్ విగ్రహావిష్కరణ, అనంతరం సభా కార్యక్రమాలు ఉంటాయని ఆయన తెలిపారు.

వరాహావతారంలో..



వేంకటేశ్వరాలయం వద్ద వరాహావతారంలో జగన్నాథుడు

నరసన్నపేట: మండల కేంద్రంలోని వెంకటేశ్వరాలయంలో ఘనంగా జగన్నాథస్వామి రథయాత్ర ఉత్సవాలు జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా స్వామిని శుక్రవారం వరాహ అవతారంలో అలంకరించారు.

జల్లంత..తుళ్లింత



హమ్మయ్య.. వాన పడింది. మండుతున్న ఎండల దెబ్బకు ప్రతి రోజూ మబ్బుల రాక కోసం నింగి వైపు చూసిన సిక్కోలు వాసులను మేఘాలు శుక్రవారం కరుణించాయి. జిల్లా కేంద్రంలో పొద్దుటి నుంచి ముసురుకున్న మబ్బులు జల్లులు చిలకరించాయి. పెద్ద వాన పడకపోయినా వాతావరణాన్ని మాత్రం చల్లబరిచాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం









వానలో స్కూళ్లకు వెళ్తున్న విద్యార్థులు

ఏఓబీ కేర్‌ఫుల్!



జాతీయ రహదారిపై తనిఖీలు చేస్తున్న పోలీసులు



పోలీసుల దాడిలో పట్టుబడిన గంజాయి(ఫైల్)

- జోరుగా గంజాయి, సారా అక్రమ రవాణా
- సరిహద్దు గ్రామాల గుండా సరఫరా

ఇచ్ఛాపురం రూరల్:

అమాయక పల్లెటూర్లను అక్రమార్కులు తమ అకృత్యాలకు వినియోగించుకుంటున్నారు. పొరుగు రాష్ట్రం నుంచి గంజాయి, సారా వంటి నిషేధిత ఉత్పత్తులను రవాణా చేయడానికి సరిహద్దు గ్రామాలను దారిగా ఉపయోగించుకుంటున్నారు. కార్లు, లారీలు, బస్సులు, ట్రైన్లు వంటి వాహనాలపై మత్తు పదార్థాలు తరలిస్తూ కోట్లాది రూపాయలు ఆర్జిస్తున్నారు.



ముఖ్యంగా ఇచ్ఛాపురం సరిహద్దు ఒడిశా చికిటి బ్లాక్‌ను కేంద్రంగా మార్చుకొని అక్రమ దారులుగా పిలిచే కేదారిపురం, జయంతిపురం, తూటుపురం, టి.బరంపురం, గుడ్డిభద్ర కొజ్జిరియా, పురుషోత్తపురం చెన్నై టు కోల్‌కతా రాకపోకలు సాగించే 16వ నంబర్ జాతీయ రహదారితో పాటు రైలు నిలయాలు కేంద్రాలుగా గంజాయి, గుట్కా, నల్లమందు వంటి నిషేధిత పదార్థాలతో పాటు నాటుసారా వ్యాపారాలు కూడా యథేచ్ఛగా చేస్తున్నారు. పురుషోత్తపురం మినహా ఈ సరిహద్దుల్లో ఎలాంటి తనిఖీ కేంద్రాలు లేనందు వల్ల చీకటి వ్యాపారాలకు సరిహద్దు అడ్డాగా మారింది.

ఎప్పటి నుంచో..

గతంలో ఇచ్ఛాపురం, ఒడిశా సరిహద్దు ప్రాంతంలోని ఓ ప్రైవేటు గోదాంలో కోట్లాది రూపాయల విలువైన గుట్కాను విజిలెన్స్, పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. గుట్కా విక్రయాలపై నిషేధం ఉన్న కాలంలో కోట్లాది రూపాయలు విలువ చేసే సరుకు ఇక్కడే దాచి ఉంచారు. కవిటి, ఇచ్ఛాపురం మండల సరిహద్దుల్లో, రైల్వేస్టేషన్లలో లెక్కకు మించి గంజాయి రవాణాపై దాడులు చేశారు. ఒడిశా సుమండీ, బలరాంపురం, జగన్నాథ పురం, ముచ్చింద్ర, అరకబద్ర, సముద్ర తీరం సువర్ణాపురం వంటి సరిహద్దు గ్రామాల సమీపంలో నాటుసారా అక్రమ రవాణాపై అటు పోలీసులు, ఇటు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్ఈబీ)శాఖలు దాడులు చేస్తున్నప్పటికీ అడ్డదారుల్లో వ్యాపారాలు కొనసాగిస్తూనే ఉన్నారు.



అక్రమార్కులకు అడ్డాగా ఆంధ్రా-ఒడిశా సరిహద్దు రహదారి

జాతీయ రహదారి గుండా..



నిషేధిత ఉత్పత్తులను రవాణా చేయడానికి దుండగులు కొత్త కొత్త మార్గాలను అన్వేషిస్తున్నారు. రహదారి గుండా ప్రయాణించే లారీ డ్రైవర్లకు, లారీ క్లీనర్లకు మత్తు పదార్థాలను అమ్మేందుకు పాన్ షాపులు, టీ షాపులను కేంద్రాలుగా మార్చుకుంటున్నారు. మూడు రోజుల క్రితం వంద కిలోల గంజాయిని, కిలోకుపైగా నల్లమందును ఎస్ఈబీ, పోలీసు అధికారులు పట్టుకున్నారు. ఇవి దొరికిన షాపులు చాలా చిన్నవి కావడం గమనార్హం. జాతీయ రహదారి వెంబడి ఇలాంటి చిరు దుకాణాల్లోనే గంజాయి, సారా విక్రయాలు జరుగుతున్నట్లు భోగట్టా.

మూడేళ్లలో..

ఇచ్ఛాపురం సర్కిల్ పరిధిలో 2020లో సుమారు కోటీ ఐదు లక్షల విలువైన 3,500 కిలోల గంజాయిని పట్టుకోగా, 2021లో సుమారు రూ.60 లక్షల విలువైన 2000 కిలోలకు పైగా గంజాయిని పట్టుకున్నారు. 2022లో సుమారు రూ.3లక్షల 60వేల విలువైన 120 కేజీలకు పైగా గంజాయిని, 2023లో వేర్వేరు దాడుల్లో సుమారు మూడున్నర లక్షల రూపాయలు విలువైన సుమారు 117 కేజీల గంజాయిని పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ముఖ్య కూడళ్లలో దాడులు



ఆంధ్రా, ఒడిశా సరిహద్దులను రవాణా కేంద్రాలుగా మలుచుకొని అక్రమ వ్యాపారాలు సాగిస్తున్న నేపథ్యంలో ముఖ్య కూడళ్లలో దాడులు చేస్తున్నాం. ఇప్పటికే ఇచ్ఛాపురం, కవిటి మండల పోలీస్ స్టేషన్ పరిధుల్లో జాతీయ రహదారులపై నిర్వహించిన దాడుల్లో గంజాయిని పట్టుకున్నారు.

– రాజాన ఈశ్వరచంద్ర ప్రసాద్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్, ఇచ్ఛాపురం

సంక్షేమం అందాల్సిందే



వీసీలో పాల్గొన్న స్పీకర్ తమ్మినేని సీతారాం, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, జేసీ నవీన్, ఇతర అధికారులు.

- జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలి
- స్పీకర్ తమ్మినేని సీతారాం

శ్రీకాకుళం పాతబస్టాండ్:

అర్హత ఉండి సంక్షేమ పథకం అందని లబ్ధిదారుడు ఎవరూ ఉండకూడదని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. దీనికి సంబంధించిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శుక్రవారం వర్చువల్ విధానంలో ప్రారంభించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో స్పీకర్ తమ్మినేని సీతారాం, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ఇన్‌చార్జి ఆర్డీఓ మురళీకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. మండల స్పెషలాఫీసర్లు కచ్చితంగా మండలాన్ని విజిట్ చేయాలన్నారు. ముందుగానే పక్కా ప్రణాళిక వేసుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో అందిస్తున్న సర్వీసులు అన్నీ ఉచితంగా అందించడం జరుగుతుందని, క్షేత్రస్థాయిలో ఇంటింటికి వెళ్లినప్పుడు చాలా ఓపికగా, సహనంతో, మర్యాదగా వారి సమస్యను విని వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ మాట్లాడుతూ జిల్లాలో నియోజకవర్గాల వారీగా ప్రత్యేక అధికారులను నియమించినట్లు తెలిపారు. ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేసుకుని ఇంటింటికీ వెళ్లాలన్నారు. సచివాలయాల పరిధిలో ఒక్క ఇల్లు మిస్ కాకుండా చూడాలని, వలంటీర్లు 100 శాతం ఇంటింటికి వెళ్లాలన్నారు. ప్రతి కార్యాలయంలోనూ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని, వలంటీర్లు ఇంటింటికి వెళ్లడం, రిజిస్ట్రేషన్లు చేయడం, ఏ రోజు కారోజు డేటా ఇచ్చేలా చూడాలన్నారు. జిల్లాలోని అన్ని సచివాలయాల్లోనూ నెట్ కనెక్టివిటీ ఉందా లేదా అనేది ఎంపీడీఓలు పరిశీలన చేయాలన్నారు. నెల రోజులపాటు జిల్లాలో జరిగే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఎంవీ పద్మావతి, జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్, జిల్లా పరిషత్ సీఈఓ వెంకట్ రామన్, గ్రామ వార్డు సచివాలయాల నోడల్ అధికారి వాసుదేవరావు, జిల్లా వెనుకబడిన తరగతుల అధికారి అనురాధ తదితరులు హాజరయ్యారు.

విజయవంతం చేద్దాం

శ్రీకాకుళం అర్బన్: జిల్లాలో 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఆదేశించారు. జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై శుక్రవారం మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఈఓఆర్డీలతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు కార్యక్రమాన్ని ఎలా నిర్వహించాలనే దానిపై శిక్షణ ఇవ్వాలన్నారు. క్షేత్రస్థాయిలో ఇంటింటికి వెళ్లినప్పుడు అనేక రకాల సమస్యలు వస్తాయని, వాటిని ఎలా పరిష్కరించాలి అనేదానిపై దృష్టి సారించాలన్నారు. ముందుగానే పక్కాగా ప్రణాళిక వేసుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. డాక్యుమెంట్లు కరెక్ట్‌గా ఉంటేనే సర్వీస్ రిక్వెస్ట్ రైజ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంపై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని సూచించారు. నిబంధనలు పాటించి అడిగిన సర్వీసుకు కచ్చితంగా పరిష్కారం చూపించాలన్నారు. క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లినప్పుడు చాలా ఓపికగా, సహనంతో, మర్యాదగా వారి సమస్యను విని వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ అర్హత కలిగిన లబ్ధిదారుల కోసమే ఈ జగనన్న సురక్ష కార్యక్రమం అన్నారు. కార్యక్రమ నిర్వహణకు కావాల్సిన పూర్తి సామగ్రి అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

జూలైలో పలాసకు రానున్న సీఎం జగన్

- మంత్రి సీదిరి అప్పలరాజు వెల్లడి

కాశీబుగ్గ: రానున్న జూలైలో పలాస నియోజకవర్గానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విచ్చేయనున్నారని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. కాశీబుగ్గ పాత జాతీయ రహదారిలోని కల్యాణ మండపంలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా తొలి సమావేశం పలాసలో ఏర్పాటు చేశారని, ఉద్దాన కిడ్నీరోగుల కోసం రూ.50 కోట్లతో కిడ్నీ ఆస్పత్రి, రీసెర్చ్ సెంటర్, రూ.700 కోట్ల వాటర్ గ్రిడ్ శంకుస్థాపన చేశారని, ఇప్పుడు వాటిని సీఎం ప్రారంభిస్తారని చెప్పారు. టెక్నికల్ సమస్యలతో పథకాలకు నోచుకోని వారికి జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా అన్ని సేవలు అందుతాయని చెప్పారు. దుష్ట చతుష్టయంతో పోరాడుతూ ఎన్నికలకు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పలాస నియోజకవర్గంలో టీడీపీ నాయకురాలు గౌతు శిరీషా ప్రజలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు, ఎంపీపీ డొక్కరి దానయ్య, నాయకులు పానిల శ్రీనివాసరావు, ఉంగ సాయికృష్ణ, ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, కోత పూర్ణచంద్రరావు, హనుమంతు వెంకటరావు, బోర కృష్ణారావు, పుక్కళ్ల గురయ్యానాయుడు, పి.వి.సతీష్, బెల్లాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి సీదిరి అప్పలరాజు

టెన్త్ సప్లిమెంటరీలో 73.32% ఉత్తీర్ణత

శ్రీకాకుళం న్యూకాలనీ: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల్లో సిక్కోలు విద్యార్థులు మెరుగైన ఉత్తీర్ణత సాధించారు. ఈ ఫలితాలు శుక్రవారం వెలువడ్డాయి. ఫలితాల్లో శ్రీకాకుళం జిల్లా విద్యార్థులు 73.32 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో 7వ స్థానంలో నిలిచారు. ఏప్రిల్‌లో జరిగిన పబ్లిక్ పరీక్షల్లో జిల్లా రెండో స్థానం సాధించింది. సప్లిమెంటరీ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 4562 మంది విద్యార్థులు హాజరు కాగా.. 73.32 శాతం ఉత్తీర్ణతతో 3345 మంది ఉత్తీర్ణత సాధించారు. ఈ ఫలితాల్లో కూడా బాలికలే పైచేయి సాధించారు. బాలురు 2654 మంది పరీక్షకు హాజరుకాగా 70.99 శాతం ఉత్తీర్ణతతో 1884 మంది పాసయ్యారు. ఇక బాలికలు 1908 మంది పరీక్షకు హాజరుకాగా 76.57 శాతం ఉత్తీర్ణతతో 1461 మంది ఉత్తీర్ణులయ్యారు.

రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ ఇలా..

మార్కులపై సందేహమున్న విద్యార్థులు రీకౌంటింగ్ కోసం ఈనెల 29వ తేదీలోగా సబ్జెక్టుకు రూ.500 చొప్పున సీఎఫ్ఎంఎస్.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌పోర్టల్‌లో చలానా జనరేట్ చేసుకుని దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. రీవెరిఫికేషన్‌తోపాటు ఆన్సర్ బుక్‌లెట్ ఫొటో కాపీ కోసం సబ్జెక్టుకు రూ.1000 చొప్పున ఈనెల 29వ తేదీలోగా సీఎఫ్ఎంఎస్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

స్టోన్ ప్లాంటేషన్ వేగవంతం కావాలి: జేసీ



టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జేసీ నవీన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో జరుగుతున్న స్టోన్ ప్లాంటేషన్ మరింత వేగవంతం కావాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సంయుక్త కలెక్టర్, సబ్ కలెక్టర్లు, ఆర్డీఓలు, తహసీల్దార్లు, సర్వేయర్లు, వీఆర్‌ఓలతో ఆయన శుక్రవారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ స్టోన్ ప్లాంటేషన్ కార్యక్రమం గతంలో వేగవంతం చేసినప్పటికీ, మళ్లీ కార్యక్రమం వెనుకంజలో ఉందన్నారు. ఇలాగైతే అనుకున్న లక్ష్యాలను సాధించలేమని తెలిపారు. స్టోన్ ప్లాంటేషన్ విషయంలో క్షేత్రస్థాయిలో సమస్యలు ఉంటే వాటిని తమ దృష్టికి తీసుకురావాలని పిలుపునిచ్చారు. కొన్ని చోట్ల మందకొడిగా సాగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఇకపై ఇలాంటివి పునరావృతం కారాదని జాయింట్ కలెక్టర్ అన్నారు. స్టోన్ ప్లాంటేషన్ జూలై 28 లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో ఇంకా పూర్తి కాని గ్రామాల్లో త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో చేపడుతున్న రీ సర్వే పనులపై ఆరా తీశారు. కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్‌లో సబ్ కలెక్టర్లు రాహుల్ కుమార్ రెడ్డి, ఇన్‌చార్జి డీఆర్‌ఓ మురళీకృష్ణ, తహసీల్దార్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

26 నుంచి కుష్టువ్యాధి సర్వే

అరసవల్లి: ఈ నెల 26 నుంచి వచ్చే నెల 16 వరకు జిల్లా వ్యాప్తంగా కుష్టువ్యాధిపై ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నామని జిల్లా కుష్టు వ్యాధి నియంత్రణాధికారి డాక్టర్ ఎస్.అనూరాధ శుక్రవారం తెలిపారు. షెడ్యూల్ ప్రకారం వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి కుష్టు వ్యాధి లక్షణాలపై ఆరా తీస్తారని పేర్కొన్నారు. కుష్టు వ్యాధిని బహుళ ఔషధ చికిత్స (ఎండీటీ)తో పూర్తిగా నయం చేయవచ్చునని తెలిపారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా మందులు లభిస్తున్నాయన్నారు.

అర్హులందరికీ ఉపాధి పనులు

శ్రీకాకుళం రూరల్: జాబ్‌కార్డు కలిగిన ప్రతిఒక్కరికీ ఉపాధి పని కల్పించాలని నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జి.వి.చిట్టిరాజు అన్నారు. బైరి గ్రామం పరిధిలో జరుగుతున్న పంట కాలువ అభివృద్ధి పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని వేతనదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నిర్దేశిత కొలతల మేరకు రెండు పూటలా పని చేస్తే గరిష్ట వేతనం రూ.272 పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో ఏపీఓ సీతారాం, జేఈ బాలముకుందం బాబు, టెక్నికల్ సిబ్బంది పాల్గొన్నారు.

వారాహి అమ్మవారికి పుష్పాభిషేకం



పుష్పాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: బలగ నాగావళి నది ఒడ్డున ఉన్న బాలా త్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో జరుగుతున్న వారాహి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం అమ్మవారికి పుష్పాభిషేకం నిర్వహించారు. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో కుంకుమార్చనలు, యంత్రపూజ, ద్వాదశి హారతులు, ప్రత్యేక పూజలు జరిగాయి. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశం

అరసవల్లి: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 10.30 గంటల నుంచి జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు సీఈవో ఆర్.వెంకట్‌రామన్ ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. 38 మండలాల జెడ్పీటీసీలు, స్థానిక జిల్లాతో పాటు విజయనగరం, మన్యం పార్వతీపురం జిల్లాల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలతో హాజరుకావాలని తెలిపారు.

కేజీబీవీ పోస్టులకు సర్టిఫికెట్ల పరిశీలన

శ్రీకాకుళం న్యూకాలనీ: కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న ప్రిన్సిపాళ్లు, సీఆర్టీలు, పీఈటీలు, పీజీటీ పోస్టుల భర్తీలో భాగంగా మెరిట్ లిస్టులో ఉన్న దరఖాస్తుదారుల సర్టిఫికెట్ల పరిశీలన శని, ఆదివారాల్లో నిర్వహించనున్నట్లు సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టర్ రోణంకి జయప్రకాష్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో ఉన్న 32 కేజీబీవీల్లో వివిధ పోస్టుల భర్తీకిగాను సమగ్రశిక్ష రాష్ట్ర ప్రాజెక్ట్ అధికారి తొలుత 1:3 రేషియోలో 406 మందితో మొదటి మెరిట్ లిస్టు విడుదల చేశారు. తాజాగా 1:5 రేషియోలో 631 మందితో రెండో జాబితాను విడుదల చేశారు. మొదటి విడతకుగాను 406 మందికి 300 మంది మాత్రమే సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరయ్యారు. మరో 106 మంది గైర్హాజరయ్యారని ఏపీసీ జయప్రకాష్ చెప్పారు. దీంతో మొదటి విడతగా గైర్హాజరైన 106 మందితో పాటు రెండో విడత అభ్యర్థినులు 631 మంది కలుపుకొని మొత్తం 737 మంది మెరిట్ లిస్ట్ అభ్యర్థినుల సర్టిఫికెట్లను శని, ఆదివారం రెండు రోజులపాటు పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు. అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని ఇందిరా నగర్ కాలనీలో పరిధిలో రామలక్ష్మణ ఎస్‌బీఐ బ్రాంచ్ వెనుకన ఉన్న సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్ట్ కార్యాలయానికి హాజరుకావాలన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య రెండు రోజులు పరిశీలన జరుగుతుందన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	59,450–00
బంగారం(22సి. 10గ్రా.)	54,500–00
వెండి (కిలో)	75,000–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 550.00
విజయనగరం	రూ. 554.00
శ్రీకాకుళం	రూ. 554.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹145	₹270	₹ 280

పారదర్శకతే లక్ష్యంగా

ఈ-స్టాంపింగ్

- స్థిరాస్తుల రిజిస్ట్రేషన్లు మరింత సులువు
- నాన్‌జ్యుడీషియల్ స్టాంపులకు అదనపు ఖర్చు అక్కర్లేదు
- పారదర్శకతను పెంచేందుకే అమలులోకి ఈ-స్టాపింగ్
- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, సీఎస్‌సీ, బ్యాంకుల్లో ఈ-స్టాంపింగ్



జిల్లా రిజిస్ట్రేషన్, స్టాంపుల విభాగం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): రిజిస్ట్రేషన్లకు సంబంధించి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక విప్లవాత్మక మార్పులు వచ్చాయి. రిజిస్ట్రేషన్ లావాదేవీల్లో, దస్తావేజు తయారీలో, నాన్ జ్యుడీషియల్ స్టాంపుల కొనుగోలులో పారదర్శకతను పెంచారు. ఇప్పుడు నాన్ జ్యుడీషియల్ స్టాంప్‌లతో సమాన విలువైన ఈ-స్టాంపులు అందుబాటులోకి వచ్చాయి. అపోహలు పక్కన పెట్టి ఈ-స్టాంపింగ్‌లు వాడుకోవాలని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోని సిబ్బంది కోరుతున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్ర రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు, స్టాంపులు, రిజిస్ట్రేషన్లు శాఖ కమిషనర్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆదేశానుసారం ఓ ప్రత్యేక బృందం శ్రద్ధగా గేమ్ ఛేంజింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. పారదర్శకంగా, జవాబుదారీతనంతో వేగవంతంగా ప్రజలకు సేవలు అందించాలనే ఉద్దేశంతో ఆన్‌లైన్ సర్వీసులు ప్రారంభించింది. అందులో ప్రధానంగా రికార్డులు డిజిటలైజేషన్, ఈసీ, సీసీలు, ఫర్మ్‌లు, సొసైటీలు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునే వెసులుబాటు అందుబాటులోకి వచ్చింది. నాటి మాన్యువల్ పద్ధతులు కాకుండా కార్డు సీసీఏ నుంచి, కార్డు 20 వరకు కాలానుగుణంగా మారుతున్న సాంకేతిక పద్ధతులను ఉపయోగించుకుంటూ అన్ని సేవలను సామాన్యులు సైతం సరళంగా అర్థం చేసుకునేలా చేశారు. అఫిడవిట్లు, బ్యాంకులోన్స్, తనఖాలు వంటివాటితో పాటు రిజిస్ట్రార్ సేవలైన కొనుగోలు, బహుమానాలు, ఫ్యామిలీ సెటిల్‌మెంట్‌లు, పంపకాలు వంటి వ్యవహారాలకు స్టాంప్‌పేపర్స్ (నాన్-జ్యుడిషియల్) తప్పనిసరి. ఈ క్రమంలోనే ఈ-స్టాంప్ విధానానికి రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ శ్రీకారం చుట్టింది.

లాభాలెన్నో..

- పారదర్శకత, వేగవంతం, జవాబుదారీతనం వంటి లక్ష్యాలతో ఈ-స్టాంపింగ్ విధానం అమలవుతుంది. ప్రజలకు మరింత సులువుగా సేవలు అందించే ఉద్దేశంతో ఈ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చారు.
- కామన్ సర్వీస్‌సెంటర్ (సీఎస్‌సీ), ఎంపిక చేయబడిన బ్యాంకుల్లో ఈ-స్టాంప్స్ లభిస్తాయి.
- రోజువారి జరిగే అన్ని రకాల రిజిస్ట్రేషన్‌లు, నాన్-రిజిస్ట్రేషన్లు కార్యకలాపాలకు ఉపయోగార్థం ఈ- స్టాంప్స్‌ను ఉపయోగించుకోవచ్చు.
- అన్ని రకాల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రత్యేక ఈ-స్టాంప్ కౌంటర్లు ద్వారా అన్ని రకాల పేమెంట్లు చెల్లించే సౌకర్యం ఉంటుంది.
- ఆర్‌ఎస్.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్ ద్వారా జిల్లాల వారీగా సీఎస్‌ఈ, ఏసీసీ ద్వారా వివరాలు పొందవచ్చు.
- లైసెన్స్ పొందిన స్టాంప్ వెండర్ సీఎస్‌సీ సెంటర్స్, బ్యాంకుల వద్ద ఇతర ఆర్థిక వ్యవహారాలను నిర్వహించే సంస్థల వద్ద ఈ-స్టాంప్స్ లభ్యమవుతాయి.
- ప్రస్తుతమున్న నాన్-జ్యుడిషియల్ స్టాంప్ పేపర్‌కు సమానమైన విలువ, సమాంతరమైన సేవలు ఈ- స్టాంపింగ్‌తో లభిస్తాయి.

పారదర్శకతే లక్ష్యం..



రిజిస్ట్రేషన్స్ స్టాంప్స్ శాఖలో మరింత పారదర్శకత పెంచేందుకు అనేక నూతన విధానాలను ప్రభుత్వం అమల్లోకి తీసుకొస్తోంది. నాన్-జ్యుడిషియల్ స్టాంపులతో సమాన విలువైన ఈ-స్టాంప్‌లను అందుబాటులోకి తీసుకొచ్చాం. దీనిపై ఎటువంటి అపోహలు పడొద్దు. ఈ-స్టాంపింగ్‌తో మరింత పారదర్శకత, వేగంగా పనిచేయడం సాధ్యమవుతాయి. ప్రతి ఒక్కరు ఈ-స్టాంపింగ్‌పై అవగాహన పెంచుకుని సులువుగా లావాదేవీలు చేసుకునేందుకు చొరవ చూపాలి.

– కిల్లి మన్మధరావు, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్‌శాఖ, శ్రీకాకుళం

ఉత్సాహంగా ఒలింపిక్ డే రన్



ఒలింపిక్ డే రన్‌లో పాల్గొన్న ధర్మాన కృష్ణదాస్ తదితరులు

- జెండా ఊపి ర్యాలీని ప్రారంభించిన ధర్మాన కృష్ణదాస్
- ఆరోగ్యవంతమైన సమాజం నిర్మిద్దామని పిలుపు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళంలో ఒలింపిక్ డే రన్ ఉత్సాహంగా సాగింది. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్, క్రీడాసంఘాల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఒలింపిక్ డే రన్‌ను ఒలింపిక్ అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ జెండా ఊపి ప్రారంభించారు. క్రీడాజ్యోతిని శ్రీకాకుళం మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి. పద్మావతి వెలిగించి కృష్ణదాస్‌కు అందజేశారు. పొట్టి శ్రీరాములు జంక్షన్ వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీ పాతబస్టాండ్ నుంచి వైఎస్సార్ సర్కిల్, పాలకొండ రోడ్, డే అండ్ నైట్ జంక్షన్, అంబేడ్కర్ జంక్షన్ మీదుగా కోడిరామ్మూర్తి స్టేడియం ప్రాంగణం వరకు సాగింది. అనంతరం కృష్ణదాస్ మాట్లాడుతూ రోజులో ఆరోగ్యం కోసం కనీసం గంట కేటాయించాలన్నారు. వ్యాయామం వల్ల ఆసుపత్రికి వెళ్లాల్సిన అవసరం ఉండదన్నారు. క్రీడల అభివృద్ధికి సమష్టిగా ముందుకు వెళ్దామన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా స్పోర్ట్స్ కోటా ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సాంబమూర్తి, సలహాదారు పి.సుందరరావు మాస్టారు, ఉపాధ్యాక్షులు శిమ్మ రాజశేఖర్, చిట్టి నాగభూషణరావు, హారికాప్రసాద్, జిల్లా పీఈటీ సంఘ అధ్యక్షుడు ఎం.వి.రమణ, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బి.వి.రమణ, వై.పోలినాయుడు, సెట్‌శ్రీ సీఈఓ బి.వి.ప్రసాదరావు, చీఫ్ కోచ్ డాక్టర్ శ్రీధర్‌రావు, కొమర భాస్కరరావు, శివకుమార్, అర్జున్‌రావురెడ్డి, డీఎస్‌ఏ కోచ్‌లు, పీడీ, పీఈటీలు, క్రీడాసంఘాల ప్రతినిధులు, వాకర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ వర్సిటీ వీసీ నియామకానికి నోటిఫికేషన్ విడుదల



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ నియామకానికి ఉన్నత విద్యాశాఖ గురువారం నోటిఫికేషన్ విడుదల చేసింది. అంబేడ్కర్ వర్సిటీతో పాటు రాష్ట్రంలోని ఆంధ్రా విశ్వవిద్యాలయం, ద్రావిడన్ విశ్వవిద్యాలయం, రాయలసీమ విశ్వవిద్యాలయం, శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, జేఎన్‌టీయూ అనంతపురం విశ్వవిద్యాలయాల వీసీల నియామకం చేపట్టనున్నారు. ప్రస్తుతం అంబేడ్కర్ వర్సిటీ వీసీగా కొనసాగుతున్న ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు మూడేళ్ల పదవీ కాలం 2024 జనవరి 18తో ముగియనుంది. విశ్వవిద్యాలయం 2008లో ఏర్పడగా రెగ్యులర్ వీసీలుగా ప్రొఫెసర్ ఎస్వీ సుధాకర్, ప్రొఫెసర్ హనుమంతు లజపతిరాయ్, కూన రామ్‌జీ కొనసాగారు. ఇన్‌చార్జి వీసీలుగా ప్రొఫెసర్ వై.సత్యనారాయణ, ప్రొఫెసర్ ఆర్‌జీబీ భగవత్‌కుమార్, ప్రొఫెసర్ ఎం.చంద్రయ్య, ప్రొఫెసర్ జి.నాగేశ్వరరావు, సతీష్‌చంద్ర సేవలందించారు. వీసీ నియామకం సకాలంలో పూర్తి చేయాలంటే ఇప్పటి నుంచే ప్రక్రియ ప్రారంభించాలి. పదేళ్లు ప్రొఫెసర్‌గా పనిచేసిన వారు అర్హులుకాగా, ఉన్నత విద్యాశాఖకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. 20 రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాలి. ప్రభుత్వ, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్, స్థానిక విశ్వవిద్యాలయం నామినీలతో కూడిన సెర్చ్ కమిటీ దరఖాస్తులు పరిశీలించి వీసీగా ఎంపిక చేస్తుంది.

బోధనా పద్ధతుల్లో మార్పు అవసరం



ట్రిపుల్ ఐటీ క్యాంపస్ డైరెక్టర్ జగదీశ్వరరావు

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రస్తుత విద్యా విధానంలో వస్తున్న మార్పులు నేపథ్యంలో బోధనా పద్ధతుల్లోనూ మార్పులు అనివార్యమని శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) ఎస్ఎంపురం క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు అన్నారు. ఎస్‌సీస్ సాఫ్ట్‌వేర్‌పై నిర్వహించిన రెండు రోజులుగా జరుగుతున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ శిక్షణ శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యలో అనేక మార్పులు వస్తున్నాయని చెప్పారు. అంతర్జాతీయంగా వస్తున్న మార్పులు గమనించి పారిశ్రామిక అవసరాలకు తగ్గట్లు విద్య అందించాలన్నారు. కార్యక్రమంలో ఓఎస్‌డీ ఎల్.సుధాకర్‌బాబు, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, డీన్ ఆఫ్ అకడమిక్ అఫైర్స్ కె.మోహన్‌కృష్ణ చౌదరి పాల్గొన్నారు.

ఐటీడీఏ నుంచి ఉద్యోగులను రిలీవ్ చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎన్జీఓ సంఘం ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్ : వైద్య ఆరోగ్య శాఖ నుంచి బదిలీ అయిన ఉద్యోగులు ఐటీడీఏ పీఓ నుంచి రిలీవ్ ఆర్డర్లు పొందేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎన్జీఓ సంఘం ప్రతినిధులు శుక్రవారం కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌ను ఆయన చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. అదే విధంగా గ్రామ సచివాలయంలో ఏఎన్ఎంగా పనిచేసిన టి.సత్యవతి కోవిడ్ సమయంలో మృతిచెందారని, ఆమె కుటుంబానికి కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇప్పించాలని కోరారు. వీటిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో ఏపీఎన్జీఓ రాష్ట్ర సహాధ్యక్షుడు చౌదరి పురుషోత్తమనాయుడు, జిల్లా జేఏసీ చైర్మన్ హనుమంతు సాయిరాం, జిల్లా కార్యదర్శి చల్లా శ్రీనివాసరావు, ఎస్సీ వెల్ఫేర్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బడియా కామరాజు, ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాయి వేణుగోపాల్, ఏపీఎన్జీఓ పట్టణ అధ్యక్షుడు బొచ్చ శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షుడు డి.శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

‘నాపై విచారణ చేపట్టండి’

ఇచ్ఛాపురం: తనపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేయించాలని ముఖ్యమంత్రిని కోరినట్లు సీడాప్ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి మోసం చేశానని తనపై తప్పుడు ఆరోపణలు చేస్తూ ఈనాడు దినపత్రికలో ఈ నెల 15న కథనం ప్రచురితమైందని పేర్కొన్నారు. తనపై ప్రచురించిన ఆరోపణలు ఖండిస్తూ విచారణ చేయించాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కోరినట్లు తెలిపారు. అదే విధంగా తనపై తప్పుడు ఆరోపణలు చేసిన వారిపైనా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరినట్లు చెప్పారు.

బొడ్డేపల్లి శతజయంతి ఉత్సవ ఏర్పాట్ల పరిశీలన




ఏర్పాట్లను పరిశీలిస్తున్న పేరాడ తిలక్, కమిటీ సభ్యులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): బొడ్డేపల్లి రాజగోపాలరావు శతజయంతి ఉత్సవాలు విజయవంతం చేయాలని కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ పిలుపునిచ్చారు. ఈ నెల 25న శ్రీకాకుళంలోని ఎన్టీఆర్ మున్సిపల్ గ్రౌండ్‌లో ఉదయం 10గంటలకు జరగనున్న రాజగోపాలరావు శతజయంతి ఉత్సవ బహిరంగ ఏర్పాట్లను శుక్రవారం పరిశీలించారు. వైఎస్సార్ కూడలిలో రాజగోపాలరావు విగ్రహావిష్కరణ అనంతరం సభ నిర్వహించనున్నట్లు తిలక్ తెలిపారు. ఎంపీగా ఆరుసార్లు ఎంపికైన గొప్ప రాజకీయవేత్త రాజగోపాలరావు అని కొనియాడారు. జిల్లాకు వంశధార ప్రాజెక్టు నిర్మాణం చేసి సాగునీరందించి రైతన్నకు అండగా నిలిచిన మహోన్నత వ్యక్తని పేర్కొన్నారు. శతజయంతి ఉత్సవ ఆహ్వాన కమిటీ నాయకులు దుప్పల వెంకటరావు, ఎన్ని ధనుంజయరావు, గుంట తులసీరావు, పూడి తిరుపతిరావు, హనుమంతు సాయిరాం పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ నేరం

అరసవల్లి: జిల్లాలో గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ బి.మీనాక్షి హెచ్చరించారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టం అమలుపై జిల్లా స్థాయి సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో స్త్రీ, పురుషులు సమానమేనని.. నిబంధనలను ఉల్లంఘించిన స్కానింగ్ సెంటర్లపై కఠిన శిక్షలు తప్పవన్నారు. జిల్లాలో మొత్తం 108 స్కానింగ్ సెంటర్లు ఉన్నాయని..ప్రతి స్కానింగ్ సెంటర్‌లోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విశ్రాంత న్యాయమూర్తి పి.జగన్నాథం మాట్లాడుతూ భ్రూణ హత్యలపై పోలీసులు సమగ్ర విచారణ జరిపి నేరస్తులకు శిక్షలు వేయగలిగితే.. ఇలాంటి అక్రమాలు పునరావృతం కావని చెప్పారు. సమావేశంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అనూష, ఎస్ఐ శ్రీలక్ష్మి, న్యాయ సలహాదారు సరల కుమారి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ మీనాక్షి

అభివృద్ధి, సంక్షేమం జగనన్నకు రెండు కళ్లు

- వైఎస్ఆర్ సీపీ ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్



మాట్లాడుతున్న చింతాడ రవికుమార్

ఆమదాలవలస: నాలుగేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమం దిశగా పరుగులు పెడుతోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్ అన్నారు. ఆమదాలవలసలో జగనన్న ప్రజాసేవా కార్యాలయంలో జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు ఆదిరెడ్డి అధ్యక్షతన అభివృద్ధి, సంక్షేమం జగనన్నకు రెండు కళ్లువంటివన్నారు. చంద్రబాబు హయాంలో అన్నీ ఇబ్బందులే ఉండేవన్నారు. జగనన్న పాలనలో విద్య, వైద్యం, వ్యవసాయం, మహిళా అభ్యున్నతి, పేదరిక నిర్మూలన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి రాష్ట్రాన్ని అనేక సూచికల్లో మొదటి స్థానంలో నిలిపారని గుర్తు చేశారు. రైతు భరోసా కింద రూ.27 వేల కోట్లు, అమ్మ ఒడి, విద్యాదీవెన, నాడు నేడు పథకాలకు రూ.36,500 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. రూ.54,000 కోట్లతో 22 లక్షల పేద కుటుంబాలకు ఇళ్ల పట్టాలు ఇచ్చి గృహాలు కట్టిస్తున్నారని తెలిపారు. పారిశ్రామిక వృద్ధి 12.8 శాతం సాధించి 10.4 లక్షల మందికి పారిశ్రామికంగా ఉద్యోగాలు లభించాయని చెప్పారు. ప్రతిపక్షాలు రోడ్లపై విష ప్రచారాలు చేస్తున్నాయని 2014–19లో చంద్రబాబు హయాంలో రాష్ట్రంలో 6670 కి.మీ. రోడ్లు వేస్తే, ప్రస్తుత నాలుగేళ్ల పాలనలో 7273 కి.మీ. రోడ్లు వేసినట్లు వివరించారు. ఈ గణాంకాలన్నీ కేంద్ర ప్రభుత్వ నీతి ఆయోగ్, రిజర్వ్ బ్యాంక్, కేంద్ర సమాచార కమిషన్, రాష్ట్ర సమాచార కమిషన్, కేంద్ర వ్యవసాయ, పారిశ్రామిక శాఖల నివేదికల నుంచి విడుదలయ్యాయని తెలిపారు. సమావేశంలో పార్టీ కార్యకర్తలు కొప్పల ఈశ్వరరావు, ముద్దాడ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పట్టుబడిన చైన్‌స్నాచర్లు



వివరాలు వెల్లడిస్తున్న మెళియాపుట్టి ఎస్సై రాజేష్

మెళియాపుట్టి: ఈ నెల 21న పెద్దపద్మాపురం గ్రామానికి చెందిన వృద్ధురాలు గొట్టిపల్లి నారాయణమ్మ నుంచి మూడు తులాల బంగారు గొలుసును తెంచుకుపోయిన చైన్‌స్నాచర్లను శుక్రవారం మెళియాపుట్టి ఎస్సై రాజేష్ పట్టుకున్నారు. కేసును ఛేదించేక్రమంలో మెళియాపుట్టి కూడలిలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించి ఆటోను గుర్తుపట్టారు. ఒడిశా సరిహద్దుల్లో ఉన్న గొప్పిలి గ్రామంలో ఉన్నట్లు తెలుసుకుని చాకచక్యంగా వ్యవహరించి పట్టుకున్నారు. ఈ ఘటనలో విజయనగరం జిల్లా మెంటాడ మండలం చిట్టాడ గ్రామానికి చెందిన గొర్లె పెద్దింటమ్మ, ఆటోడ్రైవర్ పాల వేణులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి గొలుసు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కోర్టులో హాజరుపరిచారు. వీరు విజయనగరం జిల్లాలో పలు గ్రామాల్లో గొలుసు దొంగతనాలు చేసి పలు కేసుల్లో నిందితులుగా అరెస్ట్ అయ్యి బెయిల్‌పై వచ్చారు.

ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్ మృతి



భర్త మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య



ప్రమాదానికి గురైన ట్రాక్టర్

నరసన్నపేట: గుండువల్లిపేట వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీకాకుళం రూరల్ మండలం కరజాడకు చెందిన పిట్ట రాజారావు(40) మృతి చెందాడు. నరసన్నపేట నుంచి కరజాడ వైపు ట్రాక్టర్‌తో వెళ్తుండగా అదుపు తప్పి డివైడర్ ఎక్కడంతో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రాజారావుకు నరసన్నపేటలో ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స అందిస్తుండగా మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కాగా ట్రాక్టర్‌ను వెనుక నుంచి లారీ ఢీకొనడంతో అదుపు తప్పి బోల్తాపడిందని కొందరు చెబుతున్నారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ వై.సింహాచలం ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడు తండ్రి లక్ష్మణరావు కూడా గతంలో ట్రాక్టర్ ప్రమాదంలోనే టెక్కలి వద్ద మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న రాజారావు భార్య గంగమ్మ, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. రాజారావు ట్రాక్టర్‌ను గ్యాస్ పైప్‌లైన్ కంపెనీకి లీజుకు ఇచ్చి తాను కూడా డ్రైవర్‌గా పనిచేస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

కంద్రవీధిలో కొట్లాట



ఆరా తీస్తున్న ఎస్ఐ రామకృష్ణ

టెక్కలి రూరల్ : టెక్కలి మేజర్ పంచాయతీలోని కంద్రవీధిలో శుక్రవారం రాత్రి కొంత మంది యువకులు హల్‌చల్ సృష్టించారు. కనిపించిన వారిపై దాడికి పాల్పడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కంద్రవీధికి చెందిన ఓ యువకుడు చేరివీధికి కొంతమంది యువకులతో గొడవ పడ్డాడు. అనంతరం చేరివీధి యువకులు కంద్రవీధికి వచ్చి యువకుడి కోసం గాలించారు. ఈ క్రమంలో ప్రతి ఇంటికీ వెళ్లి మహిళలను సైతం బెదిరించి కనిపించిన వారిపై దాడిచేశారంటూ కంద్రవీధి వాసులు వాపోతున్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ రామకృష్ణ సిబ్బందితో వెళ్లి విషయంపై ఆరా తీశారు. ఇరువర్గాలను పిలిచి విచారిస్తామని ఎస్ఐ తెలిపారు.